క్లుప్తంగా

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణం


అలంకరణలో స్వామి, అమ్మవార్లు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శనివారం కల్యాణోత్సవం పూజలు వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో జరిగిన కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

మహానందిలో వీకెండ్ సందడి


మహానందీశ్వరుడి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

మహానంది: వరుస సెలవులు, వీకెండ్ కావడంతో మహానంది ఆలయం భక్తులతో సందడిగా మారింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలోని వినాయకనంది, గరుడనంది ఆలయాలతో పాటు నందిసర్కిల్, పెద్ద నంది ప్రాంతాలను సందర్శించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ షేక్షావలి

నందికొట్కూరు: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి షేక్షావలి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్ లేకుండా విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం ఖాయమని చెప్పారు. స్టాక్ రిజిస్టర్లు ఇన్వాయిసులు, బిల్ బుక్స్, సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్ లేకపోతే విత్తనాలు అమ్మకుండా నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. అనుమతి ఉన్న విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతి

పాములపాడు: మండలంలోని బానుముక్కల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నడిపి ఉశేన్ (85) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. మాజీ సర్పంచు బాలునాయక్ మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశాడన్నారు. ఆమన మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

ఖైదీల్లో మార్పు రావాలి


ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి వాసు

నంద్యాల(వ్యవసాయం): జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల జీవితాల్లో మార్పు రావాలని మూడవ అదనపు జిల్లా జడ్జి మండల లీగల్ సెల్ చైర్మన్ పి.వాసు పేర్కొన్నారు. శనివారం నంద్యాల సబ్‌జైలును అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు పరిసరాలు, పరిశుభ్రత, వంట గదులు, ఖైదీల గదులను పరిశీలించి జైలు అధికారులకు పలు సూచనలు చేశారు. ఖైదీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గురుప్రసాదరెడ్డి, లీగల్‌సెల్ సిబ్బంది శేఖర్ పాల్గొన్నారు.

మేలోనే పదునెక్కిన భూములు

- నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో ఆశాజనకంగా వర్షాలు
- సాగుకు అనుకూలంగా మారిన భూమి
- ముందస్తు సాగు చేపట్టిన రైతన్నలు


నందికొట్కూరు సమీప పొలాల్లో చెత్తా చెదారం కాల్చివేస్తున్న వ్యవసాయ కూలీలు


ఎద్దులతో భూమిని దున్నుతున్న రైతు

నందికొట్కూరు/ఆత్మకూరు: నాలుగైదు రోజుల నుంచి ఉరుములు, మెరుపులతో వర్షాలు కురవడంతో భూములు పదునెక్కాయి. ఏరువాక పౌర్ణమి వేడుకలకు ముందుగానే మే నెలలోనే వర్షాలు కురవడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో భూమి చల్ల బడింది. ఆయా మండలాల్లో వాగులు, వంకలకు స్వల్పంగా నీరు చేరాయి. భూములు సాగుకు అనుకూలంగా మారడంతో రైతులు వ్యవసాయ పనుల్లో మునిగిపోయారు.

పొలం పనుల్లో అన్నదాతలు నిమగ్నం

నందికొట్కూరు, ఆత్మకూరు డివిజన్ల పరిధిలో ఈనెల 13వ తేదీ నుంచి వర్షాలు కురుస్తున్నాయి. నందికొట్కూరు మండలంలో శుక్రవారం 16.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా ఆత్మకూరు మండలంలో 43.7 మి.మీ. వర్షం కురిసింది. ఈ ఏడాది మే మాసంలోనే వర్షాలు కురవడంతో రైతన్నల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు బీడు భూముల నుంచి అన్ని రకాల భూములు పదునెక్కాయి. దీంతో అన్నదాతలు నాగలి చేతపట్టి పొలాల్లోకి రెట్టింపు ఉత్సాహంతో అడుగుపెడుతున్నారు. కొందరు రైతులు కాడెద్దులు, ట్రాక్టర్లతో వేసవి దున్నుకోవడంతో పాటు పొలాలకు పశువుల ఎరువులను తోలుకోవడం, వాటిని చిమ్ముకునే పనిలో మునిగిపోయారు. సాధారణంగా ఖరీఫ్ సాగులో జూన్ 15వ నుంచి జూలై 10వ తేదీ వరకు విత్తన సాగులో నిమగ్నం కావాల్సి ఉండగా, జూన్ మొదటివారంలోనే విత్తు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వేకువజాము నుంచే పొలం పనుల్లో దిగుతుండటంతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి.

మొక్కజొన్నపై ఆసక్తి

ఆత్మకూరు డివిజన్ పరిధిలో అన్నదాతలు ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు మండలాల్లో మొక్కజొన్న పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతంలో పొద్దుతిరుగుడు పంటను సాగు చేసేందుకు ఇష్టపడే రైతులు ప్రస్తుతం వాణిజ్య పంట అయిన మొక్కజొన్న సాగుకు ఎక్కువ ఉత్సాహం చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధిస్తున్న మొక్కజొన్న గత మూడేళ్ల నుంచి ఆత్మకూరు డివిజన్ పరిధిలో రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. వీటితోపాటు మెట్ట వరి పంటలతో పాటు కంది, పెసర, పత్తి, ఎండుమిర్చి పంటల సాగుకు కూడా సిద్ధమవుతున్నారు.

అన్నదాతలకు అనువైన ఖరీఫ్ సీజన్

రైతులు ఖరీఫ్ సీజన్ కంటే ముందుగా వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఈ సీజన్ ఎంతగానో ఉపయోగ పడుతుంది. ప్రస్తుతం వర్షాలు బాగా పడడంతో పొలాలను దుక్కులతో పాటు ఎరువులు చల్లుకోవడం, భూసార పరీక్షలు తదితర వాటికి మండలాధికారులను సంప్రదించాలి. పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించుకునేందుకు ఈ సమయం ఎంతగానో ఉపయోగ పడుతుంది.

– విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఓ ఆత్మకూరు

జూపాడుబంగ్లాలో 8.8 మిల్లీమీటర్ల వర్షపాతం

జూపాడుబంగ్లా: శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 8.8 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలోని మిడుతూరు మండలంలో అత్యధికంగా 36.4మిల్లీమీటర్లు, కొత్తపల్లిలో అత్యల్పంగా 6.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. నందికొట్కూరులో 33.4ఎం.ఎం, పాములపాడులో 9.6ఎం.ఎం, జూపాడుబంగ్లాలో 8.8ఎం.ఎం, పగిడ్యాలలో 6.6 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని తెలిపారు. మూడు రోజుల నుంచి వరుసగా వర్షాలు కురుస్తుండటంతో పొలాలు ఖరీఫ్ పంటల సాగుకు అనుకూలంగా మారినట్లు రైతులు పేర్కొంటున్నారు.

పాదరక్షల టెండరుదారుడికి నోటీసు

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తుల నుంచి టెండరుదారులు దేవస్థానం నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామని మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. భక్తుల పాదరక్షలు భద్రపరుచుకునే వద్ద టెండరుదారుడు రూ. 5 తీసుకోవాల్సి ఉండగా రూ. పది వసూలు చేశాడని ఓ భక్తుడు శనివారం ఫోన్ ద్వారా ఈఓకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఈఓ పాదరక్షల టెండరుదారుడికి నోటీసు జారీ చేశారు. ఏ టెండరుదారుడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవన్నారు.

కౌలురైతును ఆదుకోవాలి


దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న బైరాపురం షేక్‌మహబూబ్ బాషా, రైతులు

ఆత్మకూరు: పంట నష్టపోయిన కౌలురైతుని ప్రభుత్వం ఆదుకోవాలని కృషి పండ్ల తోటల రైతు సేవాసంఘం పట్టణ అధ్యక్షుడు, ఆత్మకూరు అర్బన్ రైతు భరోసా కేంద్ర చైర్మన్ బైరాపురం షేక్ మహబూబ్‌బాషా కోరారు. పట్టణంలోని నంద్యాల రహదారిలో షేక్షావలి అనే కౌలురైతు 10 ఎకరాలు కౌలుకు తీసుకొని బొప్పాయి, అరటిని సాగు చేశాడు. ఎండల తీవ్రత వల్ల భూగర్భ జలాలు అడుగంటడంతో పొలంలో దాదాపుగా నాలుగు బోర్లు ఎండిపోయి చేతికొచ్చిన పంటలు నష్టపోయాడు. మహబూబ్‌బాషాతో రైతు సంఘం నాయకులు శనివారం నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కౌలు రైతు షేక్షావలి దాదాపు రూ.25 లక్షలు దాకా పెట్టుబడి పెట్టాడని, రూ.35 లక్షలు నుంచి రూ.40 లక్షలు దాకా ఆదాయం వచ్చే తోట నష్టపోవడం జరిగిందన్నారు. షేక్షావలికి నష్టపరిహారం అందించాలని ఉన్నతాధికారులను, ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రైతులు నబిసాబ్, అబ్దుల్‌రసూల్, టైగర్‌బాబు, దుబ్బలింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోవిందు మృతి బాధాకరం


గోవిందు కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ఈఓ, ఉద్యోగులు

మహానంది: చిగురు కోసం చెట్టెక్కి కిందపడి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఏజేన్సీ ఉద్యోగి గోవిందు మృతి తీరనిలోటని మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూ. 53వేలను శనివారం మృతుడి భార్య, కుటుంబ సభ్యులకు అందించారు. వారు మాట్లాడుతూ గోవిందు ఆలయంలో అన్ని పనులు చేసేవాడన్నారు. ఎవరు ఏ పని చెప్పినా కాదనకుండా చేస్తూ అందరి మన్ననలు పొందాడన్నారు. ఉద్యోగులు అందరూ కలిసి తమవంతుగా రూ. 53వేలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ఓంకారం వేంకటేశ్వరుడు, వై.మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పథకాలను శుభ్రం చేయండి

జూపాడుబంగ్లా: పక్షం రోజులకో పర్యాయం గ్రామాల్లోని తాగునీటి పథకాలను పంచాయతీ కార్యదర్శులు శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేయించాలని ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 38 ఓవర్‌హెడ్, 14 జీఎల్ఎస్ఆర్, 40 సిస్టన్, 240 చేతిపంపులున్నాయన్నారు. వాటిని 15రోజులకోపర్యాయం శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలన్నారు. వర్షాలు ప్రారంభమైనందున గ్రామాల్లో తాగునీరు కలుషితమై డయేరియా(వాంతులు, విరేచనాలు)వ్యాపించే అవకాశాలున్నాయని చెప్పారు. గ్రామాల్లోని ప్రజలు వారి ఇళ్లపరిసరాల్లో మురుగునీరు నిల్వలేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే కాచివడగట్టిన నీటిని మాత్రమే తాగాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి పైపులు లీకేజీ అయ్యి నీరుకలుషితం అవుతున్నట్లయితే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. తాగునీటి పైపులు ఎక్కడైనా మురుగునీటి కాల్వల్లో ఉన్నట్లయితే వాటిని తొలగించి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేయాలని సర్పంచులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు.

ఘనంగా వాసవీ మాత జయంతి


నందికొట్కూరులో వ్రతం చేస్తున్న భక్తులు


ఆత్మకూరులో అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలో వెలిసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, విశేష పూజలు జరిపారు. మహిళలు వందలాది సంఖ్యలో అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి క్షీరాభిషేకం, ప్రత్యేక అలంకరణ తదితర విశేష పూజలు జరిపించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

నందికొట్కూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు కృష్ణానది జలాలను సూర్యనారాయణ స్వామి ఆలయం నుంచి కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం వరకు ఊరేగింపుగా తెచ్చారు. అమ్మవారికి భక్తులు వాసవి వ్రతం, కుంకుమార్చన, పుష్పార్చన చేశారు. వేసవి శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఆర్యవైశ్య సంఘం సభ్యులు అవార్డులు అందజేశారు.

వెలుగోడు: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు స్థానిక అమ్మవారి ఆలయంలో కనుల పండుగగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి పురోహితులు నరసరామశర్మ ఆధ్వర్యంలో కుంకుమార్చన, ఒడి బియ్యం, ప్రత్యేక పూజలు చేపట్టారు. పసుపు రంగు చీరలు ధరించి మహిళలు సామూహిక లలితా సహస్ర పారాయనం చేశారు. 11 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తాంబులాలు ఇచ్చారు. మధ్యాహ్నం విందు ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో అలంకరించి ఊయల ఉత్సాహం నిర్వహించారు. మహిళలు, చిన్నారుల కోలాటం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లాలం సుధాకర్, కమిటీ సభ్యులు జూటూరు నాగపుల్లయ్య, శ్రీనివాసులు, శ్రీరాం నాగేశ్వరరావు, మల్లికార్జున పాల్గొన్నారు.


మహిళలు, చిన్నారుల కోలాటం

వాహనం సరే.. లైసెన్స్ మాటేంటి?

- లైసెన్సు పట్ల వాహనచోదకుల నిర్లక్ష్యం
- మొత్తం వాహనదారుల్లో సగం మందికే లైసెన్సు
- రెన్యూవల్‌కు దూరం
- ఏడాదిలో 4,419 వాహనాలపై కేసులు
- రూ.7.99 కోట్ల జరిమానా వసూలు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీఓ అధికారులు(ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): ఎలాంటి వాహనం నడపాలన్నా డ్రైవింగ్ తెలిసి ఉండాలి. లైసెన్సూ తప్పనిసరి. కానీ ఈ విషయాన్ని వాహనదారులు ఖాతరు చేయడం లేదు. లక్షల రూపాయలు వెచ్చించి.. మెచ్చిన వాహనం కొనుగోలు చేస్తున్నారే కానీ.. లైసెన్సు తీసుకోవడానికి మాత్రం ముందుకు రావడం లేదు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదానికి గురైతే బీమా వర్తించదు. ప్రాణాలు పోవడమో.. అంగవైకల్యానికి గురికాక తప్పదనే విషయాలు తెలిసినా వచ్చీ రాని డ్రైవింగ్‌తో పాటు ట్రాఫిక్, డ్రైవింగ్ నిబంధనలు తెలియకుండా రయ్..రయ్ మంటూ దూసుకెళ్తూ ఎదుటి వారి ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఇలాంటి పరిస్థితికి చెక్ పెట్టేందుకు రవాణాశాఖతో పాటు పోలీస్ శాఖ సిబ్బంది నిత్యం జరిమానాలు విధిస్తూ, హెచ్చరికలు జారీ చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు.

చిక్కితే అంతే..

రవాణాశాఖ అధికారులు, పోలీసులు నిత్యం తనిఖీలు నిర్వహించి లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారు. జిల్లాలో గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 694 ట్రాన్స్‌ఫోర్ట్ వాహనాలు, 25,140 నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు రిజిష్టర్ కాగా, అందులో కేవలం 4,032 మందికి మాత్రమే లైసెన్స్‌లున్నాయి. రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న వారిలో లైసెన్స్‌లు లేని వారే అధికంగా ఉంటున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. వాహనదారుల్లో మార్పు కోసం ఎల్ఎల్ఆర్ మేళాలు, రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్, ఓవర్‌లోడ్ వంటి వాటికి కూడా జరిమానాలు విధిస్తున్నా స్పందన వాహనదారుల నుంచి కనిపించడం లేదు.

గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ జరిమానాల వివరాలు..

రిజిష్టర్ అయిన ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు	- 694
రిజిష్టరైన నాన్‌ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు	- 25,140
లైసెన్స్‌లు పొందినవారు	- 4,032
కేసులు నమోదైన వాహనాల సంఖ్య	- 4,419
జరిమానా చెల్లించిన వాహనాల సంఖ్య	- 4,128
పెనాల్టీ ద్వారా వసూలైనా మొత్తం	- 7,99,94,880
పెనాల్టీ చెల్లించాల్సిన వాహనాల సంఖ్య	- 291

భారీగా పెనాల్టీలు..

లైసెన్స్‌లు లేని, నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్న వారిపై రవాణాశాఖ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. భారీగా జరిమానాలు విధిస్తున్నారు. గతేడాది ఏప్రైల్ నెల నుంచి ఈ ఏడాది మార్చి చివరి నాటికి జిల్లా వ్యాప్తంగా 10 మంది ఎంవీఐలు పెద్ద ఎత్తున వాహనాలను తనిఖీ చేసి 4,128 వాహనాల నుంచి రూ.7,99,94,880 జరిమానా వసూలు చేశారు. రానున్న రోజుల్లో నిబంధనలు మరింత కఠినతరం చేసి ఉల్లంఘనులపై చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.

జరిమానాతో పాటు జైలుశిక్ష



డ్రైవింగ్ లెసెన్స్ లేకుండా వాహనాలు నడపటం ప్రమాదకరం, నేరం. పోలీసుల సహకారంతో రవాణా శాఖ పరిధిలో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. ప్రభుత్వం డీఎల్ ప్రక్రియను సులభతరం చేసింది. ఎల్ఎల్ఆర్ పరీక్షలో అతి సులువైన ట్రాఫిక్ సిగ్నల్‌కు సంబంధించిన ప్రశ్నలు మాత్రమే ఉంటాయి. డీఎల్ రెన్యూవల్ చేసుకోని చోదకులు వెంటనే ఆ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. గతంలో పట్టుకున్న వాహనాలకు నోటీసులు జారీ చేశాం. వారు వెంటనే అపరాధ రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అవగాహన లేని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ఓవర్‌లోడ్, ఓవర్ స్పీడ్ వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి.

–జీవీ శివారెడ్డి, డీటీఓ, నంద్యాల

విజ్ఞానానికి మూలం.. పుస్తక పఠనం


పుస్తక పఠనంలో నిమగ్నమైన విద్యార్థులు

పగిడ్యాల: పుస్తక పఠనమే విజ్ఞానానికి మూలమని బీఈడీ కళాశాల లెక్చరర్ సురేష్‌నాయుడు, లైబ్రేరియన్ మద్దమ్మ తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థుల చేత వివిధ కథల పుస్తకాల పఠనం చేయించారు. అనంతరం హితోపదేశం, మిత్రలాభం కథలలోని నీతిని విద్యార్థులకు వివరించారు. దినపత్రికలు కూడా చదవడం వలన ప్రపంచ విషయాలు తెలుస్తాయన్నారు. అన్ని కాంపీటీటివ్ పరీక్షలను కూడా ధైర్యంగా రాయగలిగే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. గ్రంథాలయ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం


ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

నంద్యాలశ్రీ(న్యూటౌన్): రాష్ట్రంలో ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏపీటీఎఫ్ పనిచేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు అన్నారు. శనివారం హోలీక్రాస్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సామాజిక భద్రత సీపీఎస్ రద్దు అయ్యేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నంద్యాల జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మాధవస్వామి, నగరి శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. శ్రీనివాసులు, ఉమర్, జనార్ధన్‌రెడ్డి, సుంకన్న, శ్రీదేవి, మునిస్వామి, బేబి రాణి, ధనలక్ష్మితో పాటు 18మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

కనులపండువగా పద్మావతి, శ్రీనివాసుడి కల్యాణం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బాలాజీ మర్చెంట్ కల్యాణ మండపంలో శనివారం వైశాక శుద్ధ దశమిని పురస్కరించుకొని పద్మావతి శ్రీనివాసుడి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేదపండితులు నిఖిలేష్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. పెళ్లి పెద్దలుగా ఆరవేటి రాజారత్నం, దంపతులు దుద్దేల సురేష్ బాబు దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో నారాయణ, కశెట్టి చంద్రశేఖర్, కృష్ణమూర్తి, శ్రీనివాస్‌కుమార్, గురుచరణ్, కృష్ణమూర్తి, నవీన్‌కుమార్, శ్రీకాంత్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ముగిసిన ధార్మిక కార్యక్రమం


ప్రవచనాలు వినిపిస్తున్న దీవీ హయగ్రీవాచార్యులు

నంద్యాల(వ్యవసాయం): మండలంలోని బిల్లలాపురం గ్రామ శివాలయంలో మూడు రోజులుగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలు శనివారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు వ్యాఖ్యాతగా వ్యవహరించి, భగవద్గీత, శ్రీమద్రామాయణం, మహాభారతంలోని ధార్మిక ప్రవచనాలను భక్తులకు వివరించారు. అనంతరం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమం చేపట్టారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, రామకృష్ణారెడ్డి, అనిల్‌కుమార్, తిరుమలేష్, డాక్టర్ అపర్ణ, కృష్ణమ్మ, నాగలక్ష్మమ్మ పాల్గొన్నారు.

21న మండల సర్వసభ్య సమావేశం

మహానంది: ఈ నెల 21న బండిఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బండిఆత్మకూరు మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఉంటుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ ఆసరా నిధులు మంజూరు

జూపాడుబంగ్లా: వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా పొదుపు మహిళలకు చివరి విడత నిధులను ఎన్నికల కమిషనర్ నిబంధనలను సడలించటంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా నిధులను బ్యాంకు ఖాతాలకు జమచేయటంతో పొదుపు మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగనన్న మాట ఇచ్చాడంటే ఎన్ని అవాంతరాలు ఎదురైనా నెరవేర్చుతాడని మహిళలు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, పగిడ్యాల, మిడుతూరు, నందికొట్కూరు, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లోని 4,063 పొదుపు గ్రూపులకు రూ.27,27,03,166ల నగదును డీబీటీ పద్ధతి ద్వారా పొదుపు మహిళల ఎస్‌హెచ్‌జీ బ్యాంకు ఖాతాలకు జమచేశారు.